అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ చేతన్

# అర్జీలపై నిర్లక్ష్యం వద్దు : కలెక్టర్

**ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్**

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలపై ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా వాటి పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ టిఎస్.చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌తో ఇన్‌ఛార్జి డిఆర్ఒ సూర్యనారాయణ రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామసుబ్బయ్య, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, ఆర్డీవో సువర్ణ హాజరై ప్రజల నుంచి 240 అర్జీలను ప్రజల నుంచి అధికారులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. అర్జీదారుడు రెండవసారి కలెక్టరేట్‌కు రాకూడదన్నారు. భూ సమస్యలు, రేషన్ కార్డులు, ఇంటి పట్టాలు, పింఛన్ల కోసం ఎక్కువగా అర్జీలు వస్తున్నాయని వీటి పరిష్కారంపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలని తెలియజేశారు.

**మట్టి వినాయకుడినే పూజిద్దాం**

పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకున్ని పూజించాలని కలెక్టర్ కోరారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణంలో ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. సహజరంగులతో చేసిన మట్టి వినాయకుల ప్రతిమలను కలెక్టర్ ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ శాఖ జిఎం నాగరాజు, కాలుష్య నివారణ బోర్డ్ అధికారులు పాల్గొన్నారు.

**గుడ్లు బడ్లు అందజేత**

**పుట్టపర్తి క్రైమ్ :** డిఆర్‌డిఎ కార్యాలయం వద్ద ఎన్ఈసిసి పథకం కింద గుడ్లు ద్వారా అక్కడికక్కడే వంట తయారీకి అవసరమైన బండ్లను కలెక్టర్ చేతన్ ప్రారంభించారు. లబ్ధిదారులకు వీటిని పంపిణీ చేశారు. ఈ బండి విలువ రూ.35వేలు కాగా రూ.15వేలు విలువజేసే పాత్రలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. జిల్లా మొదటి దశ కింద 10 బండ్లు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పని ఫుల్.. వేతనం హాఫ్..!

విద్యార్థినులకు కుట్లు అల్లికలు, మట్టి బొమ్మల తయారీపై శిక్షణ ఇస్తున్న పార్ట్ టైం ఆర్ట్, క్రాఫ్ట్, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్ట్రక్టర్స్

**◆ శ్రమదోపిడీకి గురవుతున్న పార్ట్ టైం ఆర్ట్, క్రాఫ్ట్, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్ట్రక్టర్స్**

**◆ హాఫ్ డే జీవో రద్దుచేసి ఫుల్ డే ఇవ్వాలంటూ డిమాండ్**

**ప్రజాశక్తి-పెనుకొండ**

ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సమగ్రమైన, సమతుల్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం పార్ట్ టైం ఆర్ట్, క్రాఫ్ట్, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్ట్రక్చర్స్‌ను నియమించింది. వీరు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం అభివృద్ధి, సంగీతం, కుట్లు అల్లికలు, బొమ్మలు వేయడం, వ్యాయామం నత్యం వంటి కళలను నేర్పిస్తుంటారు. నూతన ఆలోచనలను అలవర్చడంతో పాటు వారిలో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తుంటారు. వీరు కేవలం సగం రోజు మాత్రమే విధులు నిర్వహించేలా ప్రభుత్వ జీవో ఉంది. అయితే జిల్లాలో ఇందుకు విరుద్ధంగా వీరితో రోజంతా పనులు చేయించుకుంటూ శ్రమ దోపిడీకి గురి చేస్తున్నారు. రోజంతా పని చేస్తున్న వీరికి ప్రభుత్వం చాలీచాలని వేతనం ఇస్తోంది. ప్రభుత్వం ఫుల్ టైం జీవో నమోదు చేస్తే వీరికి పూర్తి వేతనాలు వచ్చే అవకాశం ఉంది.

**12 ఏళ్లుగా సగం జీతమే**

12 ఏళ్లుగా సగం జీతం తోనే పార్ట్ టైం ఆర్ట్, క్రాఫ్ట్, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్ట్రక్చర్స్ విధులు నిర్వహిస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పనిచేసి సగం జీతంతోనే కాలం వెళ్లదీస్తున్నారు. విద్యార్థులకు సజనాత్మక కార్యకలాపాలు నేర్పించే వీరికి ఇప్పటికీ కేవలం రూ.17 వేలు మాత్రమే వేతనం ఇస్తున్నారు. ఇది కూడా క్రమం తప్పకుండా రావడం లేదు. ప్రయివేటు పాఠశాలల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు విధులు నిర్వహిస్తే కనీసం రూ.20వేల నుంచి రూ.25 వేల జీతం ఇస్తారు. ఆ పాటి కూడా పార్ట్ టైం ఆర్ట్, క్రాఫ్ట్, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్ట్రక్చర్స్‌కు ప్రభుత్వం ఇవ్వడం లేదు.

విద్యార్థులు రిబ్బన్లతో తయారు చేసిన పూలు

**రెండు పూటలా విధులు**

ఒక్క పూట జీవోతో రెండు పూటలా పనిచేస్తున్నా ఒక పూటకు మాత్రమే జీతం ఇస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులతోపాటు రెండు పూటలా విధులు నిర్వహిస్తు న్నారు. ఉపాధ్యాయులు చేయాల్సిన పనులను వీరితోనే చేయిస్తున్నారు. తల్లికి వందనం, మధ్యాహ్న భోజన పథకం బిల్లులు చేయడం, విద్యార్థుల కిట్లు బయోమెట్రిక్, టిఎంఎఫ్ ఫొటోలు తీయడం, డ్రాప్ అవుట్ పిల్లలను గుర్తించి స్కూళ్లలోకి చేర్పించడం వంటి పనులను అదనంగా వీరు చేస్తున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలలో ముందుండి అన్ని పనులనూ వీరి ద్వారానే చేపిస్తున్నారు. ఫేషియల్ అటెండెన్స్‌నూ రెండు పూటలా వేయిస్తున్నారు. ప్రభుత్వ పథకాలలో అన్నింటిలోనూ చురుగ్గా పనిచేస్తున్న వీరికి ఉద్యోగ భద్రత లేదు. పెరిగిన నిత్యావసరాల ధరలకు అనుగుణంగా వేతనాలూ పెంచలేదు. సగం రోజు పని జీవోను రద్దు చేసి ఫుల్ డే జీవో ఇచ్చి వేతనాలు పెంచాలని పార్ట్ టైం ఆర్ట్, క్రాఫ్ట్, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్ట్రక్చర్స్ చాలా రోజుల నుంచి డిమాండ్ చేస్తున్నారు.

**ఒక్కపూట జీవో రెండు పూటలా విధులు**

శ్రీసత్యసాయి జిల్లాలోని హై స్కూల్‌ళ్లలో పనిచేస్తున్న పార్ట్ టైం ఆర్ట్, క్రాఫ్ట్, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్స్ట్రక్టర్స్ హాఫ్ డే మాత్రమే నిర్వహించే విధంగా జీవో ఉన్నప్పటికీ 12 ఏళ్లుగా జిల్లాలో దీనిని అమలు చేయడం లేదు. వీరితో ఇప్పటికీ ఫుల్‌టైం పనులు చేయించుకుంటున్నారు. 2014లో రాష్ట్ర సమగ్ర శిక్ష ఎస్‌పీడీఉత్తర్వులలో పిటిఐలు పాఠశాలల్లో విధులను హాఫ్ డే మాత్రమే నిర్వహించాలని స్పష్టంగా పేర్కొంది. రెండుపూటలా పని చేసే జీవో ఇవ్వమని అడిగినా ఇవ్వడం లేదు. ఒక్కపూట జీవోతోనే రెండుపూటలా పని చేయించుకోవడం, అరకొర జీతాలతో శ్రమదోపిడీకి గురి చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి ఫుల్ డే జీవోను అమలు చేసి అందుకు తగిన వేతనం ఇవ్వాలి.

**అధ్యక్షులు ఎన్.చంద్ర మోహన్**

## కమ్మవారిపల్లి సచివాలయ ఉద్యోగుల ఘర్షణ

**అధికారులకు పరస్పరం ఫిర్యాదులు**

**ప్రజాశక్తి-గోరంట్ల**

మండలంలోని కమ్మవారిపల్లి పంచాయతీ గ్రామ సచివాలయంలో పని చేస్తున్న సెక్రటరీ ఫరూక్, ఇంజినీర్ అసిస్టెంట్ బాలాజీ సోమవారం ఘర్షణ పడి చొక్కాలు చింపు కొన్నారు. అనంతరం ఒకరిపై ఒకరు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసుకున్నారు. వివరాలు.. కమ్మవారిపల్లి గ్రామంలో ఇంటింటి సర్వే చేయాల్సి ఉండగా సెక్రటరీ ఫరూక్ ఉదయం 10 గంటలకే వెళ్లి సర్వే పనిలో నిమగ్న మయ్యాడు. ఇంజినీర్ అసిస్టెంట్ బాలాజీ అర గంట ఆలస్యంగా వెళ్లాడు. ఈ విషయంపై ఫరూక్ ప్రశ్నించడంతో వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మాటా మాటా పెరిగి వారు రోడ్డుపై ప్రజల సమక్షంలోనే ఘర్షణ పడి చొక్కాలు చింపుకొన్నారు. వేతనాల బిల్లుకు సంబంధించిన పత్రాలపై సంతకం చేయాలని కోరగా మళ్లీ చేస్తానని సెక్రటరీ నిరాకరించారని ఇంజినీర్ అసిస్టెంట్ ఎంపిడిఒ నరేంద్రకుమార్‌కు ఫిర్యాదు చేశాడు. ఇంజినీర్ అసిస్టెంట్ విధులకు సకాలంలో హాజరు కావడం లేదని సెక్రటరీ ఈవోఆర్‌డికి చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై విచారణ చేస్తున్నామని ఎంపిడిఒ తెలిపారు.

# కబ్జాదారులకు వంత పాడుతూ పేదలను వదిలేస్తారా..!

**అధికారుల తీరుపై సిపిఎం ఆగ్రహం**

**పేదలందరికీ ఇళ్ల స్థలాలివ్వాలని ఆందోళన**

**ప్రజాశక్తి - కదిరి టౌన్**

ప్రభుత్వ స్థలం కనపడితే చాలు కబ్జా చేసే కబ్జాకోరులకు అధికారులు వంతపడతారని పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలంటే ఉదాసీనత వైఖరి ప్రదర్శిస్తున్నారని సిపిఎం పట్టణ కార్యదర్శి జగన్మోహన్ విమర్శించారు. కదిరి రూరల్ మండలం సర్వేనెంబర్ 720, కదిరి పట్టణం సైదాపురం సర్వేనెంబర్ 294 లో తాత్కాలిక గుడిసెలు వేసుకొని నివాసాలు ఉన్న పేదలందరికీ ఇంటి పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ పేదలతో కలిసి స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. అంతకు ముందు భారీ ర్యాలీ నిర్వహించారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాలో నాయకులు మాట్లాడుతూ కదిరి పట్టణంతో పాటు కుమ్మరవాండ్లపల్లి పంచాయతీలో చాలా రోజులుగా పేదలు అద్దె ఇంట్లో ఉంటూ జీవనం సాగిస్తున్నారని ప్రస్తుతం వస్తున్న సంపాదనలో నెల నెల ఇంటి బాడుగ చెల్లించడం వారికి ఇబ్బందికరంగా మారిందన్నారు. బాడుగ ఇళ్లలో నివాసాలు ఉంటున్న నిరుపేదలకు ఇళ్లస్థలాలివ్వాలని గత ఆరు నెలలుగా సచివాలయం, తహశీల్దార్ కార్యాలయాల్లో వ్యక్తిగత అర్జీలు నాలుగు దపాలుగా అందజేశామన్నారు. జిల్లా కలెక్టర్, డివిజనల్ అధికారికి ఉమ్మడి అర్జీలు ఇచ్చారన్నారు. కనీసం నిరుపేదలు పెట్టుకున్న వ్యక్తిగత అర్జీల పరిశీలన ఇంతవరకు చేయలేద న్నారు. ఈ విషయాన్ని సిపిఎం ప్రశ్నిస్తే ఆగస్టు నెలాఖరు నాటికి పేదలు పెట్టుకున్న వ్యక్తిగత అర్జీలను పరిశీలన చేసి అర్హుల జాబితా తయారుచేసి ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలాలు ఇస్తామని అధికారులు హామీ ఇచ్చారన్నారు. అయితే. ఇంతవరకు వీఆర్వోలు, సిబ్బంది కానీ పరిశీలన చేపట్టలేదనీ ఆగ్రహ వ్యక్తం చేశారు. తాత్కాలిక గుడిసెలు వేసుకొని నివాసాలు ఉంటున్న పేదలందరికీ అదే సర్వే నెంబర్లలో ఇంటి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆందోళన విషయం తెలుసుకున్న తహశీల్దార్ మురళీకృష్ణ సిపిఎం నాయకులతో ఫోన్లో మాట్లాడారు. వచ్చే నెల 10వ తేదీ లోపల పేదలు పెట్టుకున్న వ్యక్తిగతంగా పెట్టుకున్న అర్జీలను పరిశీలన చేసి అర్హులైన వారందరికీ ఇళ్ల పట్టాలు ఇస్తామన్నారు. దీంతో నాయకులు, పేదలు ధర్నా విరమించారు. వచ్చేనెల 10 లోపు న్యాయం చేయకపోతే పేదలందరూ ఐక్యంగా సొంత నిర్మాణాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ విజయ్ కుమార్ కి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గుడిసెలు వేసుకున్న పేదలు 350 మందితో పాటు సిపిఎం నాయకులు సాంబశివ, రామ్మోహన్, బాబ్జాన్, నాగేశ్వర, దివాకర్ ,అమ్ములు, అమ్మ జాన్, యాస్మిన్, గాయత్రి, పార్వతమ్మ, ప్రీతి,కాంతమ్మ , భారతి, సరస్వతి లక్ష్మీదేవి ,మాభున్నీషా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయం ముందు బైఠాయించిన సిపిఎం నాయకులు

# ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం

**పార్లమెంట్ విస్తృత స్థాయి సమావేశంలో మంత్రి టిజి భరత్**

**ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్**

తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే మూలస్తంభాలని పార్టీ అధికారంలోకి రావటానికి ఎంతో కృషి చేశారని మంత్రి టిజి. భరత్ పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం మంత్రులు, ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో పార్లమెంట్ విసృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర మంత్రి టీజీ భరత్‌తో పాటు మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి సవిత, ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యేలు పల్లె సింధూర రెడ్డి, పరిటాల సునీత ,ఎమ్మెస్ రాజు, కందికుంట వెంకటప్రసాద్, మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, పరిటాల శ్రీరామ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా టిడిపి కమిటీ ఎన్నికపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, మా రెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ వైసీపీ పాలనలో అనేక అక్రమ కేసులు బనాయించినప్పటికీ వాటన్నింటిని తట్టుకొని 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకొచ్చిన కార్యకర్తలకు పార్టీ రుణపడి ఉంటుందన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపి జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీకి అండగా కార్యకర్తలు పని చేస్తున్నారని ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీకి పనిచేసిన ప్రతి కార్యకర్తకు అధిష్టానం తగిన విధంగా గుర్తిస్తుందని చెప్పారు. టిడిపి జిల్లా కమిటీ ఎంతో పారదర్శకంగా అన్ని కులాలకు ప్రాధాన్యత కల్పించేలా పార్టీ అధిష్టానం రాష్ట్ర కమిటీ వేసి జిల్లా టీడీపీ అధ్యక్షునితో పాటు జిల్లా కార్యవర్గ సభ్యులను ఎంపిక చేస్తోందని తెలిపారు . అదే విధంగా సినీహీరో, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ 50 ఏళ్ల సినీ రంగ ప్రస్థానం చేసుకున్న సందర్భంగా ఆయన పేరు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ యూకే గోల్డ్ ఎడిషన్లో చోటు చేసుకోవటం అభినందనీయమన్నారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ, టిడిపి బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ ఇతర వర్గాల పేద పార్టీ అని పేర్కొన్నారు. కార్యకర్తలే టీడీపీకి కొండంత బలం అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి ప్రజా ప్రతినిధులు, ఆయా మండలాల కన్వీనర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు, బూత్ కమిటీ యూనిట్ ఇన్‌ఛార్జులు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు, పార్టీ అనుబంధ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి టిడిపి కార్యాలయంలో జెండాను ఆవిష్కరించిన మంత్రులు టిజి.భరత్, సవిత, ఎంపి, ఎమ్మెల్యేలు

## అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలి

**ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్**

చిలమత్తూరు మండలంలో వ్యవసాయ భూముల పేరుతో వాణిజ్య హంగులతో అక్రమ లే అవుట్లు వేశారని వాటి పై చర్యలు తీసుకోవాలని సిపిఎం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ లో గ్రీవెన్స్ లో కలెక్టర్ టి ఎస్ చేతన్ కు వినతిపత్రం సమర్పించారు. కొడికొండ గ్రామ పరిధిలో కొడికొండ హిల్స్ పేరుతో 90 ఎకరాలలో అనుమతులు లేకుండా వెంచర్ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వానికి నష్టం కలిగిస్తున్నారన్నారు. పైకి వ్యవసాయ భూములంటూ పక్క కమర్షియల్ దందా నడుస్తోందన్నారు. అహుడా, పంచాయతీల అనుమతులు లేకుండా ఫామ్ హౌస్ నిర్మాణాలు, కాంపౌండ్లు వేస్తూ పక్కా రియల్ ఎస్టేట్ వ్యాపారం నడుస్తోందన్నారు. ఈ అక్రమాలపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఫిరంగి ప్రవీణ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు హరి, జంగాలపల్లి పెద్దన్న, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు వెంకటేశు, స్వర్ణలత, సిద్దు పాల్గొన్నారు.

**బలవంతపు భూసేకరణ ఆపాలి**

జిల్లాలో పరిశ్రమల కోసం జరుగుతున్న బలవంతపు భూసేకరణ ఆపాలని ఎపి రైతు సంఘం, వ్యకాసం నాయకులు సంయుక్తంగా కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించారు. జిల్లాలో మడకశిరలో 20వేల ఎకరాలు ఎన్‌పి.కుంటలో 10,500 ఎకరాలు, రొద్దం లో 6500 ఎకరాలు, హిందూపురం, లేపాక్షి, చిలమత్తూరు, గోరంట్ల మండలాలలో బలవంతపు భూసేకరణ జరుగుతోందన్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం గ్రామ సభలో 80 శాతం రైతుల అనుమతి తీసుకోవాల్సి ఉండగా రైతులు అనుమతి లేకుండా భూసేకరణ చేస్తున్నారని తక్షణం ఆపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ, మద్దతు తెలపగా, రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు హరి, జంగాలపల్లి పెద్దన్న, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వెంకటేష్, ప్రవీణ్, నాగిరెడ్డి, కదిరప్ప పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న వ్యకాసం నాయకులు

## టిడిపి రొద్దం పంచాయతీ కన్వీనర్‌గా చిరంజీవి

**ప్రజాశక్తి-రొద్దం**

టిడిపి రొద్దం పంచాయతీ కన్వీనర్‌గా రొద్దం గ్రామానికి చెందిన వాల్మీకి చిరంజీవిని మంత్రి ఎస్.సవిత ఎంపిక చేశారు. దీంతో సోమవారం చిరంజీవికి పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. చిరంజీవి మాట్లాడుతూ పార్టీకి ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ మండలంలో పార్టీ బలోపేతానికి శాయ శక్తులా కృషి చేస్తానని తెలిపారు. అలాగే తనకు ఈ అవకాశం కల్పించిన మంత్రి సవితకు చిరంజీవి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

## జెవివి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా నరసారెడ్డి, లోకేష్

**ప్రజాశక్తి - ధర్మవరం రూరల్**

పట్టణంలోని ఎన్‌జిఒ హోంలో జరిగిన జనవిజ్ఞాన వేదిక జిల్లా మహాసభలో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నట్లు జెవివి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక ఉమ్మడి జిల్లా గౌరవ అధ్యక్షులు గా డాక్టర్ టి ఎం బషీర్, డాక్టర్ ఇ టి రామ్మూర్తి, వాసుదేవరెడ్డి, జిల్లా అధ్యక్షులుగా బి.నరసారెడ్డి(కదిరి), జిల్లా ప్రధాన కార్యదర్శిగా వి.లోకేష్(ధర్మవరం), కోశాధికారిగా డాక్టర్ ఆదిశేషు (ధర్మవరం), ఉపాధ్యక్షులుగా డి. చంద్రశేఖర్ రెడ్డి, చైతన్య గంగిరెడ్డి, గౌస్ లాజం, పి. రామకృష్ణను ఎన్నుకున్నామన్నారు. అదే విధంగా కార్యదర్శులుగా బి.నారాయణస్వామి , మహేంద్ర రెడ్డి, మంజుల, ఎంకె నబిని ఎన్నుకున్నట్లు చెప్పారు. ఈసందర్భంగా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం, ప్రశ్నించే తత్వం పెరగడానికి, మూఢనమ్మకాలను తొలగించడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

## సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహం ఏర్పాటు చేయాలని వినతి

**పెనుకొండ :** పట్టణంలో స్వాతంత్ర్య సమరయోధుడు, గీత కులాల ముద్దు బిడ్డ సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నియోజకవర్గ ఈడిగ(గౌడ) కులస్తులు మంత్రి ఎస్.సవితకు వినతి పత్రం అందజేశారు. సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన నేపథ్యంలో సోమవారం పట్టణంలోని మంత్రి కార్యాలయంలో వారు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మంత్రిని ఘనంగా సన్మానించారు. మంత్రి మాట్లాడుతూ స్థలాన్ని పరిశీలించాలని, లచ్చన్న విగ్రహాన్ని తప్పకుండా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు చిన్నప్పయ్య, గిరిధర్, నరేంద్రబాబు, భార్గవ్, హరీష్, పవన్, ప్రకాష్, బాబు, నరేష్, పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాలు తనిఖీ

**గుడిబండ :** మండలంలోని మోరుబాగల్ గ్రామంలో ఉన్న ఎరువులు, క్రిమి సంహారక మందుల దుకాణాల్లో సోమవారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. ప్రధానంగా మోరుబాగల్ ఆర్‌ఎస్‌కె, శ్రీలక్ష్మీవెంకటేశ్వర స్టోర్స్, శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్టోర్స్ ఎరువుల దుకాణాలకు వెళ్లి స్టాక్, రికార్డులను పరిశీలించారు. తనిఖీల్లో మండల వ్యవసాయ అధికారి వీరనరేష్, విజిలెన్స్ సిఐ శ్రీనివాసులు, ఎస్ఐ గోపాలుడు, కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్ సురేష్ కుమార్, ఆర్‌ఎస్‌కె ఉద్యోగులు రుహీన, వెంకటేష్‌బాబు పాల్గొన్నారు. అలాగే ఉదయం తహశీల్దార్ కె.శ్రీధర్, ఎస్ఐ కుళ్లాయప్ప, ఏవో వీరనరేష్, దుకాణాలను తనిఖీ చేశారు.

**లేపాక్షి :** మండలంలోని ఎరువుల దుకాణాలు, కొండూరు సొసైటీని సోమవారం తహశీల్దార్ సౌజన్యలక్ష్మి, వ్యవసాయ అధికారిణి శ్రీలత తనిఖీ చేశారు. స్టాక్, రికార్డులను పరిశీలించారు. రైతులకు యూరియా కొరత రాకుండా అందివ్వాలని ఆదేశించారు. యూరియా కావాల్సిన వారు ఆధార్ కార్డు, వన్-బి తీసుకొచ్చి భాగ్యలక్ష్మి ఎరువుల దుకాణం, కొండూరు సొసైటీలో తీసుకెళ్లవచ్చన్నారు. ఎవరైనా అధిక ధరలకు అమ్మితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఎస్ఐ షర్ఫుద్దీన్, సిబ్బంది కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ఎంపిలు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

**సోమందేపల్లి :** ఆర్ఎంపిలు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని వైద్యులు ఓంకార్, సూపర్వైజర్ రవీంద్ర హెచ్చరించారు. స్థానిక పిహెచ్‌సిలో సోమవారం వైద్యులు ఓంకార్ ఆధ్వర్యంలో మండలం కేంద్రంలో ఉన్న ఆర్ఎంపిలకు సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలు, భ్రూణ హత్యలకు పాల్పడినా, ప్రోత్సహించినా చర్యలు తప్పవన్నారు. నిబంధనల మేరకు ఫస్ట్ ఎయిడ్ కేంద్రాలు(ప్రాథమిక చికిత్స కేంద్రాలు) నడుపుకో వాలన్నారు. రక్తపరీక్ష, తదితర కేంద్రాల్లో ఏ జబ్బుకు ఏ పరీక్ష, దానికి ఎంత రుసుము అనే వివరాలతో రూపొందించిన పట్టికను తప్పనిసరిగా ఉంచుకోవాలన్నారు. అతిక్రమిస్తే చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

## 'ఎస్ఎస్ఎ' మార్కులు బహిర్గతం చేయాలి : యుటిఎఫ్

**పుట్టపర్తి రూరల్ :** జిల్లాలో సర్వ శిక్షా అభియాన్ పోస్టుల అభ్యర్థుల మార్కులు బహిర్గతం చేయాలని యుటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్, జిల్లా కార్యదర్శులు పి .లక్ష్మీనారాయణ. నారాయణస్వామి మాట్లాడుతూ జిల్లాలో ఖాళీగా ఉన్న వివిధ కేటగిరీలకు సంబంధించిన 10 రకాల పోస్టుల కొరకు జిల్లాలో మొత్తం 120 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారనీ. ఆ పోస్టుల నియామకం కోసం 21న అర్హులైన 34 మంది అభ్యర్థులకు మౌఖిక పరీక్షలు నిర్వహించారని చెప్పారు. అర్హత సాధించిన 34 మంది అభ్యర్థులు 85 మార్కులకు ఎన్ని మార్కులు వచ్చాయో బహిర్గతం చేయకుండా, 15 మార్కుల కొరకై ఇంటర్వ్యూలు నిర్వహించారన్నారు. దీనివల్ల అధికారులు అక్రమ మార్గాలకు తోడ్పాటు ఇచ్చినట్లు అవుతుందని అన్నారు. ఈ విషయంపై సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. కి ఇదే విషయమై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. స్పందించిన కలెక్టర్ ఏపీసి శ్రీ దేవరాజ్ ని పిలిపించి వెంటనే అభ్యర్థుల మార్కులు బహిర్గతం చేయాలని ఆదేశించినట్లు నాయకులు తెలిపారు.

## రోడ్డుపై నీటి నిల్వలు లేకుండా చర్యలు

**రొద్దం :** కొన్నేళ్లుగా పెనుకొండ-పావగడ ప్రధాన రహదారిలో చిన్నపాటి వర్షం కురిసినా స్థానిక వైఎస్ ఆర్ సర్కిల్‌లో నీరు నిలిచి మడుగును తలపించేంది. గ్రామస్తులు ఇటీవల ఈ విషయాన్ని పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఈవోఆర్‌డి గోవిందప్ప పంచాయతీ సిబ్బందితో కలిసి సోమవారం అక్కడికి వెళ్లి ప్రధాన రోడ్డుపై ఉన్న మట్టి దిబ్బలను తొలగించే పనులు చేపట్టారు. అలాగే నీరు డ్రెయినేజీ కాలువలోకి పోయేలా చర్యలు చేపట్టారు. అలాగే ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ సోమశేఖర్ ఆధ్వర్యంలో రమణనాయక్ బ్లీచింగ్ చల్లించారు. ఇకపై వర్షం కురిసినా ఎలాంటి సమస్య ఉండదని వారు తెలిపారు. తురకలాపట్నం ఎంపిపి పాఠశాల వద్ద ప్రధాన రహదారిపై నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపడుతామని ఆయన తెలిపారు. అధికారుల చర్యలతో దుకాణదారులు, వాహన దారులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఈవోఆర్‌డి గోవిందప్ప, రమణనాయక్, టిడిపి నాయకులు చిరంజీవి, పంచాయతీ సిబ్బంది రవి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై నీటి నిల్వల తొలగింపు పనులు చేపట్టిన పంచాయతీ సిబ్బంది

## నేత్రదానంపై అవగాహన

ప్రజాశక్తి - తాడిమర్రి

నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నేత్రదానం పట్ల ప్రజలకు సోమవారం అవగాహన కల్పించారు. గత ఏడాది మండల కేంద్రానికి చెందిన ఉపాధ్యాయుడైన నాగిరెడ్డి మృతిచెందగా ఆయన నేత్రాలను కుటుంబసభ్యులు దానం చేశారు. ఈనేపథ్యంలో నేత్రదాన పక్షోత్సవం సందర్భంగా నాగిరెడ్డి భార్యను సన్మానించి అభినందన పత్రాన్ని జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధికారిని డాక్టర్ అనురాధ, అప్తాల్మిక్ అధికారి ఉరుకుందప్ప అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హరిత, సూపర్వైజర్ కుమార్, పిహెచ్ఎన్ లక్ష్మీదేవి, జానకిరామ్, ఫార్మసీ రోజా హర్షవర్ధన్ రెడ్డి, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలి

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రేషన్ డీలర్లు కార్డుదారులకు సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని తహశీల్దార్ నారాయణస్వామి ఆదేశించారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ డీలర్లకు పలు సూచనలు చేశారు. తుకాలు సక్రమంగా ఇవ్వాలని,ప్రతి చౌక ధాన్యపు డిపో వద్ద బోర్డు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సిఎస్‌డిటి మునిస్వామి, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

## విగ్రహ ఏర్పాటుకు విరాళం

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి రూరల్ కుమ్మరమండ్లపల్లి పంచాయతీ రామన్నకోట ఏర్పాటు చేయనున్న వినాయక విగ్రహానికి వైసిపి నాయకులు డాక్టర్ బత్తుల హరిప్రసాద్ 20వేల రూపాయలు విరాళం అందజేశారు. నగదును విగ్రహ కమిటీ సభ్యులకి హరిప్రసాద్ తమ్ముడు డాక్టర్. రామ్ ప్రసాద్ సోమవారం అందజేశారు.

## పంటలసాగుపై అవగాహన

ప్రజాశక్తి - పరిగి

ఖరీఫ్ సీజన్లో భాగంగా మొక్కజొన్న, వేరుశనగ పంటలకు వచ్చే చీడ పీడ పురుగుల నివారణకు మందుల పిచికారి తప్పనిసరి అని డిఆర్సి అధికారి, శాస్త్రవేత్త రామసుబ్బయ్య రైతులకు సూచించారు. మండలంలోని యర్రగుంట గ్రామంలో రైతులకు మొక్కజొన్న, వేరుశెనగ పంటలపై డిఆర్సీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శాస్త్రవేత్త రామసుబ్బయ్య, సహాయ వ్యవసాయ సంచాలకులు కృష్ణయ్య హాజరై పంటలసాగు, యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిఆర్సి వ్యవసాయ అధికారి చైతన్య,మండల వ్యవసాయ అధికారి శ్రీకృష్ణ ,ఏఈవో మోహన్ రెడ్డి, రైతు సేవా కేంద్రం ఇన్‌ఛార్జి సాయినాథ్,రైతులు పాల్గొన్నారు.

**హిందూపురం :** వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పట్టణ సమీపంలోని మోతుకపల్లిలో మండల వ్యవసాయ అధికారి సురేంద్ర నాయక్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎఓ సురేంద్ర నాయక్ రైతులకు పంటసాగు, సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## తైక్వాండో పోటీల్లో 'మనీష్' సత్తా

ప్రజాశక్తి - కదిరి టౌన్

ప్రకాశం జిల్లా మార్కాపురం లో నిర్వహించిన 2025 సిబిఎస్ఇ సౌత్ జోన్ తైక్వాండో పోటీల్లో కదిరికి చెందిన సివి. మనీష్ కుమార్ అండర్ -17 38 కేజీల విభాగంలో సత్తా చాటి సిల్వర్ మెడల్ సాధించి జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ పోటీ వచ్చే నెల గ్వాలియర్‌లో జరుగనుంది. మనీష్ విజయం సాధించడం పట్ల కదిరి వాసులు అభినందనలు తెలిపారు. అలాగే శిక్షణ ఇచ్చిన కోచ్ శ్రీనివాస్‌కి మనీష్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యార్థులకు జిల్లాస్థాయి క్విజ్ పోటీలు

ప్రజాశక్తి - కొత్తచెరువు

ఎయిడ్స్, డ్రగ్స్ వాడకం వలన కలిగే అనర్థాల పట్ల జిల్లాలోనే జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు రెడ్‌రిబ్బన్ క్విజ్ పోటీలను నిర్వహించినట్లు డిఐఇఒ చెన్నకేశవ ప్రసాద్, ఎయిడ్స్ నియంత్రణ క్లస్టర్ ప్రోగ్రాం డైరెక్టర్ వెంకటరత్నం తెలిపారు. కొత్త చెరువులోనే జూనియర్ కళాశాలలో ఈ పోటీలను సోమవారం నిర్వహించారు. ఇందులో మొదటి బహుమతి హిందూపురానికి చెందిన ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల విద్యార్థిని భావన, సబ్రిం, రెండవ బహుమతి పెనుగొండ జూనియర్ కళాశాల విద్యార్థులు నిజాముద్దీన్ బాబా, సబ్రిం తాజ్, మూడవ బహుమతి తలుపుల జూనియర్ కళాశాల విద్యార్థులు ఖాదర్ భాషా, బాబు రెడ్డి దక్కించుకున్నారు. మొదటి రెండు బహుమతులు సాధించిన వారు ఈ నెల 26వ తేదీ విజయవాడలో కేఎల్ యూనివర్సిటీలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని అధికారులు చెప్పారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ రమణ, మురళి, కోఆర్డినేటర్ నాగేంద్ర, ప్రిన్సిపల్ జ్యోతిర్లత, నోడల్ అధికారి సంజీవరెడ్డి, జన జాగ్రఫీ ప్రాజెక్ట్ మేనేజర్ ఆంజనేయులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రికి సత్కారం

ప్రజాశక్తి - కదిరి టౌన్

పార్లమెంట్ త్రిసభ్య కమిటీ సభ్యులు, మాజీ మంత్రి దేవినేని ఉమా మహేశ్వర్ సోమవారం కదిరి పట్టణానికి వచ్చారు. స్థానిక రోడ్లు భవనాల అతిథిగృహంలో ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ మాజీమంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి చిత్రపటాన్ని బహుకరించారు.

దేవినేని ఉమకు జ్ఞాపికను అందిస్తున్న కందికుంట

# పారిశుధ్య విభాగంలో కారుణ్య నియామకాలు చేపట్టాలి : సిఐటియు

ప్రజాశక్తి - కదిరి టౌన్

మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తూ మృతిచెందిన వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సిఐటియు అనుబంధం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ కిరణ్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 2023 సంవత్సరంలో ప్రభుత్వం తీసుకువచ్చిన 39వ జీవోను కదిరి మునిసిపాలిటీలో అమలు చేయడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారుల వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మునిసిపల్ కార్మికులుగా ఉంటూ మరణించిన వారి కుటుంబంలో ఒకరికి కారుణ్య నియామకం క్రింద ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేవారు. 60 సంవత్సరాలు పైబడ్డాయంటూ 11 మంది కార్మికులను రిటైర్మెంట్ పేరుతో విధుల నుండి తొలగించారన్నారు.పట్టణ జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ కదిరి పట్టణ అధ్యక్ష కార్యదర్శులు జనార్ధన్, తిరుపాల్, కోశాధికారి బాలకృష్ణ , సిఐటియు నాయకులు బాబ్‌జాన్, రామ్మోహన్, మున్సిపల్ కార్మికులు నరసింహమూర్తి, రమణ, లక్ష్మన్న, శ్రీనివాసులు, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

# పని ఒత్తిడి తగ్గించకపోతే విధులు బహిష్కరిస్తాం

ఎంపిడిఒకు వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శులు

ప్రజాశక్తి - పరిగి

తమపై పనిఒత్తిడి తగ్గించకపోతే విధులను బహిష్కరిస్తామని మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు హెచ్చరించారు. ఈ మేరకు వారు సోమవారం స్థానిక ఎంపీడీవో రెడ్డప్పకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నతాధికారుల నుండి పారిశుధ్యం పనులు పర్యవేక్షించుటకు ఐ విఆర్ఎస్ కాల్స్ పేరుతో కార్యాలయ వేళలలో కాకుండా ప్రతిరోజు ఉదయం 6 గంటలకే విధులకు హాజరుకావాలనడం సరికాదన్నారు. ఇంటింటా సర్వే నిర్వహించుటకు ఇతర అధికారులు సహకరించకపోగా పంచాయతీ కార్యదర్శులపై మానసిక ఒత్తిడి పెరుగుతోందన్నారు. సచివాలయం నిర్వహణ ఆర్థిక భారంతో కూడిన అంశం కావడంతో వివిధ రకాల సర్వేలు చేయించడం ఒకే సమయంలో అన్ని పనులు చేయమనడం తదితర సమస్యలు ఉద్యోగ నిర్వహణలో మానసిక ఒత్తిడికి గురై ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ప్రభుత్వ పనితీరు ఇలాగే కొనసాగితే విధులను బహిష్కరించి నిరసనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు భాస్కర్ రెడ్డి, హనంపల్లి ఆదినారాయణ, కొడిగినహళ్ళి అరుణ, మోద రమేష్, ఊటకూరు ఆనంద్ కుమార్, బీచిగానిపల్లి తిప్పన్న, వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**పుట్టపర్తి రూరల్:** శ్రీ సత్య సాయి జిల్లాలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శుల పని ఒత్తిడిని తగ్గించాలని శ్రీ సత్య సాయి జిల్లా గ్రామ సెక్రటరీ అసోసియేషన్ ప్రెసిడెంట్ విశ్వనాథ్ రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం ప్రశాంతి గ్రామంలోని శ్రీ సత్య సాయి జిల్లా గ్రామ పంచాయతీ అధికారి సమతా కు తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు ఐ వి ఆర్ ఎస్ కాల్స్ కేవలం జిల్లా కార్యనిర్వహణ నిబంధన మేరకు కార్యాలయ పనివేళ ల్లో నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ సెలవు రోజులు, పండుగ సమయాల్లో సర్వేలు పేరుతో కార్యదర్శులను పనిచేయమనం వలన తగిన విశ్రాంతి లేక మానసిక ఒత్తిడికి గురి అయ్యి అనారోగ్యం పాలవుతున్నారన్నారు. సామిత్వ పథకంలో క్షేత్రస్థాయిలో అనేక సమస్యలు ఉన్నాయని సిబ్బంది లేకపోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయని దీని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. 15వ ఆర్థిక సంఘం నిధులను వెంటనే విడుదల చేయాలని వారు కోరారు .ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రెటరీ అసోసియేషన్ నాయకులు రామ మోహన్ ,శ్రావణ్ కుమార్ ,ఈశ్వర్, జైపాల్ రెడ్డి , గోపాల్ రెడ్డి తోపాటు జిల్లా నలుమూల నుండి వచ్చిన పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

## డీఎస్సీలో కానిస్టేబుల్‌కు ఉద్యోగం

ప్రజాశక్తి -గాండ్లపెంట

సోమశేఖర్

స్థానిక పోలీస్ స్టేషన్లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సద్దలపల్లి సోమశేఖర్ డీఎస్సీలో మెరిట్ జాబితాలో 68వ ర్యాంక్ సాధించారుఈసందర్భంగా కానిస్టేబుల్ సోమశేఖర్ మాట్లాడుతూ పుట్టపర్తి మండలంలోని దిగువ చెర్లోపల్లిలో మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన తాను 2018 సివిల్ కానిస్టేబుల్ ఎంపికై మొదటి పోస్టింగ్ ఆగలి మండలానికి వచ్చిందన్నారు. స్పెషల్ పార్టీలో రెండున్నర సంవత్సరాలు పనిచేశారన్నారు. అనంతరం ఒడిసి పోలీస్ స్టేషన్లో పనిచేసి ఆ తరువాత గాండ్లపెంటకు వచ్చానన్నారు. ఇక్కడి పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తూ డీఎస్సీకి సన్నద్ధమయ్యాయని చెప్పారు. ఫలితాలలో ఎస్జిటి ఉపాధ్యాయునిగా ఎంపిక అయ్యానని ఆయన తెలిపారు. గతంలో 2018 డిఎస్సీ ఫలితాలలో ఒకటిన్నర మార్కులు తప్పిపోగా అప్పటి నుంచికష్టపడి చదివానని ఆయన తెలిపారు. తన భార్య వాణి గాండ్లపెంట మండలంలో ఉప్పర వార్లపల్లి ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వహిస్తోందని చెప్పారు. ఈసందర్భంగా సోమశేఖర్‌ను తోటి సిబ్బంది, మిత్రులు అభినందించారు.

## గ్రీవెన్స్‌కు అధికారులు డుమ్మా

ప్రజాశక్తి - తాడిమర్రి

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు మండలంలోని అధికశాతం మంది అధికారులు డుమ్మాకొట్టారు. సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో కేవలం తహశీల్దార్, ఎంపిడిఒ రంగారావు మాత్రమే మండలస్థాయి అధికారులు హాజరయ్యారు. మిగతా శాఖల అధికారులు ఏ ఒక్కరూ హాజరుకాలేదు. ప్రజాసమస్యల పరిష్కారంలో వీరికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉందో ఈ ఉదంతం ఉదాహరణగా నిలిచిందని ప్రజలు విమర్శిస్తున్నారు. వివిధ సమస్యల మీద మండలకేంద్రానికి వచ్చిన ప్రజలు అధికారులు అందుబాటులో లేకపోవటంతో నిరాశగా వెనుతిరిగారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ మధ్యాహ్న సమయానికి కొందరు అధికారులు వచ్చి తాము ఈ కార్యక్రమానికి హాజరయ్యామనిపించుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా స్థాయి అధికారులు స్పందించి ప్రజాసమస్యల పట్ల నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఇద్దరు అధికారులే హాజరైన దృశ్యం

# ఆటో డ్రైవర్లను ఆదుకోండి : సిఐటియు

తహశీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి-హిందూపురం

ఉచిత బస్సు పథకం వల్ల నష్టపోతున్న ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్‌పి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు ఆటో కార్మికులు ఆందోళన నిర్వహించి, రెవెన్యూ అధికారికి వినతిని అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్ పి శ్రీనివాసులు, పట్టణ కన్వీనర్ రాము మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలు కల్పించిన ఫ్రీ బస్సు సౌకర్యం వల్ల ఆటో డ్రైవర్లు అద్దెలు లేక తీవ్రంగా నష్టపోతున్నారని ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.కాలను గుణంగా ఎన్నో సమస్యలు వస్తున్నా తమ వృత్తిని నమ్ముకుని కుటుంబ జీవనాన్ని కొనసాగిస్తున్నారన్నారు. ప్రభుత్వ లైసెన్స్ కలిగిన ప్రతి ఆటో డ్రైవర్‌కు సంవత్సరానికి రూ.25వేలు ఆర్థిక సాయం అందించాలని కోరారు. ఆటోడ్రైవర్లకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని వారి కుటుంబాలకు భరోసా కల్పించే విధంగా వెల్ఫేర్ బోర్డుని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రవాణా రంగం ద్వారా ప్రభుత్వానికి కోట్లాది రూపాయల పన్నుల రూపంలో ఆదాయం సమకూరుతుందనిఅయినప్పటికీ రవాణా రంగా కార్మికులకు ఆటో డ్రైవర్లకు ఒక్క సంక్షేమ చట్టాన్ని అమలు చేయకపోవడం ప్రభుత్వాల అసమర్థతను తెలియజేస్తుందని విమర్శించారు. ఆటోడ్రైవర్లను ఆదుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆటో డ్రైవర్లు చలో విజయవాడ సమ్మెతో పాటు ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కో కన్వీనర్ డి. రామకృష్ణ, ఆటో యూనియన్ నాయకులు బాబు రెడ్డి, సూరి, వలి, అంజనప్ప, గురు కొట్నూర్ బాబా రామాంజనప్ప, హరీష్ కుమార్, ఆది, గోపాల్, మూర్తి, రవి, కొట్నూర్, నిషాద్ తదితరులు పాల్గొన్నారు.

## క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్ల సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి - బత్తలపల్లి

విద్యా శాఖ,సమగ్ర శిక్ష లో పనిచేస్తున్న క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్లు(సిఆర్ఎంటి) సమస్యలను వెంటనే పరిష్కరించాలని యూనియన్ నాయకులు కోరారు. ఉమ్మడి అనంతపురం జిల్లా మాజీ అధ్యక్షులు,సీనియర్ నాయకులు వెంకట రమణ ఆధ్వర్యంలో సిఆర్ యం టి యూనియన్ నాయకులు సోమవారం గుంటూరు లో వున్న రాష్ట్ర విద్యా శాఖ కమిషనర్ విజయరామరాజును, విజయవాడలో ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావును కలసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సి ఆర్ యం టి లు ఎదుర్కొంటున్న సమస్యలను వారికి వివరంచారు. ఉద్యోగ విరమణ వయసు 62 సంవత్సరాలకు పెంపుదలతోపాటు రిటైర్మెంట్ గ్రాట్యుటీ సదుపాయం,ఆరోగ్య బీమా అమలు వంటివి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా నాయకులు సాయి, అశోక్ ,రమేష్, శివయ్య, హరన్ బాషా, ఓబులేసు, నరసింహ, కృష్టప్ప, మురళి, శివానంద తదితరులు పాల్గొన్నారు.

## మట్టి వినాయక విగ్రహాలనే ఉపయోగించండి

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

వినాయక చవితి పండుగ సందర్భంగా ప్రతి ఒక్కరూ మట్టి ప్రతిమలను పూజించి పర్యావరణ పరిరక్షణలో భాగం కావాలని శ్రీ వివేకానంద డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ భాస్కర్ రెడ్డి, డైరెక్టర్ బాలం లక్ష్మీనారాయణ రెడ్డి, ప్రిన్సిపల్ కరణం హర్షవర్ధన్ కోరారు. ఈ సందర్భంగా కళాశాలలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు అధ్యాపకులకు మట్టి వినాయక ప్రతిమలను ఎన్ఎస్ఎస్ పిఒ శ్రీనివాసులు ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌ఛార్జి రమేష్, అధ్యాపకులు కృష్ణయ్య, శిరీష, హరీష్ విద్యార్థులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-హిందూపురం

వినాయక చవితి సందర్భంగా ప్రతి ఒక్కరు పర్యావరణ పరిరక్షణ కోసం అందరం మట్టి వినాయక విగ్రహాలను ఉపయోగిద్దామని పాంచజన్య పాఠశాల అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు అన్నారు. సోమవారం పాఠశాలలో వినాయక చవితిని పురస్కరించుకుని విద్యార్థులు పాఠశాలలో మట్టి వినాయక విగ్రహాలను తయారు చేశారు. వాటిని శ్రీనివాసులు విద్యార్థుల తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చేసిన విగ్రహాలు పర్యావరణానికి ఎంతో నష్టం అన్నారు. మట్టి విగ్రహాలు వినియోగించి పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. అందులో భాగంగా విద్యార్థుల చేత మట్టి వినాయకులను సిద్ధం చేయించి, వాటి విలువ గురించి విద్యార్థులకు వివరించామన్నారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు వాస్తవ పరిస్థితులు పరిగణంలోకి తీసుకోని, పర్యావరణ హితంగా వేడుకలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ నంద కుమార్, హెచ్ఎం గాయత్రి, ఎఒ భాస్కర్, సుపరింటెండెంట్ విజయేంద్ర, ఎహెచ్ఎం లు శశికళ, షేక్ అబ్దుల్ రజాక్, సతీష్ కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాలతో విద్యార్థులు, తదితరులు

# సమస్యలు పరిష్కరించమంటే జనసేన నాయకుడిని కలవమంటారా..?

### విద్యుత్ ఎస్ఇ తీరుపై రైతు ఆగ్రహం

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

తన సాగు భూమికి విద్యుత్ సౌకర్యం కల్పించమని విద్యుత్ శాఖ జిల్లా అధికారి ఎస్ఇని కోరితే ఆయన జనసేన నాయకుడు రేగాటిపల్లి చిలకం మధుసూదన్ రెడ్డిని కలవమని చెబుతున్నాడని బాధిత రైతు ఆరోపించాడు. ధర్మవరం నియోజకవర్గం రేగాటిపల్లి పంచాయతీ ముచ్చుమర్రి కి చెందిన విశ్వనాథ్ రెడ్డి అనే రైతు ఆ పంచాయతీ వైసీపీ సర్పంచి సురేష్ రెడ్డితో కలిసి సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు సర్వేనెంబర్ 19-2బి నందు 5.90 ఎకరాల భూమి ఉందన్నారు. రెండేళ్ల క్రితం భూమి సాగుకు విద్యుత్ సరఫరా కోసం దరఖాస్తు చేసుకోగా 6 నెలల క్రితం విద్యుత్ శాఖ వారు అనుమతులు మంజూరు చేశారన్నారు. అయితే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని ఆ శాఖ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదన్నారు. దీంతో స్థానిక సర్పంచితో పాటు వచ్చి సమస్యను పరిష్కరించాలని కలెక్టర్‌కు అర్జీ సమర్పించానని చెప్పారు. స్పందించిన కలెక్టర్ సమస్యను పరిష్కరించాలని గ్రీవెన్స్ కు వచ్చిన విద్యుత్ శాఖ ఎస్ఇ సంపత్ కుమార్‌ను ఆదేశించారన్నారు. అయితే ఆ జిల్లా అధికారి గ్రీవెన్స్ హాలు నుంచి బయటకు వచ్చి సమస్య పరిష్కారం కావాలంటే జనసేన నాయకుడు చిలకం మధుసూదన్ రెడ్డి తో కలవాలని చెప్పడంతో అవాక్కయ్యామన్నారు. ఆయన విద్యుత్ అధికారా లేక జనసేన నాయకుడా అని ప్రశ్నించారు. సమస్య పరిష్కరించకుంటే ఇక్కడి నుంచి కదిలేది లేదని అక్కడే బైటాయించి నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ ఆర్డీవో సువర్ణకు అక్కడికి పంపించగా వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని ఎస్ఇ హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది.

కలెక్టర్ కార్యాలయం ముందు బైటాయించిన బాధిత రైతు, తదితరులు

# నేరాలు ఘోరాలు

## 'తమ్ముళ్ల' ఘర్షణ ..ఆరుగురిపై హత్యాయత్నం కేసు

ప్రజాశక్తి - బత్తలపల్లి

ఆదివారం రాత్రి తెలుగు తమ్ముళ్ల మధ్య జరిగిన ఘర్షణ ఘటనలో టీడీపీ నేత విశ్వనాథనాయుడుతో పాటు మరో ఐదుగురిపైన హత్యయత్నం కింద కేసు నమోదు చేసినట్లు బత్తలపల్లి ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నల్లబోయనపల్లి గ్రామానికి చెందిన బెస్త కౌశిక్, కట్టకిందపల్లి గ్రామానికి చెందిన విశ్వనాథనాయుడుకు కారు డ్రైవర్‌గా వెళ్లేవాడన్నారు. ఆ సమయంలో విశ్వనాథనాయుడు వద్ద కౌశిక్ తన అవసరాల కొరకు రూ. 2లక్షలు తీసుకన్నాడన్నారు. తర్వాత కౌశిక్ మొత్తం డబ్బులు తిరిగి ఇచ్చినా కానీ ప్రాంసరీ నోట్టు ఇవ్వకుండా తన వద్దే పెట్టుకొని మరలా బాకీ ఉన్నావని విశ్వనాధ్ నాయుడు అడుగుతుంటే ఆయన ప్రవర్తన నచ్చక కౌశిక్ విశ్వనాథనాయుడు వద్ద డ్రైవర్‌గా పని చేయడం మానేశాడన్నారు. అయితే విశ్వనాథనాయుడు అప్పుడప్పుడు ఫోన్ చేసి డ్రైవర్ రావాలని లేకపోతే డబ్బులు చెల్లించాలని రెండు కాదంటే చంపుతాడనని బెదిరించేవాడని తెలిపారు. ఆదివారం రాత్రి కౌశిక్, ఈదుల ముష్టూరు గ్రామానికి చెందిన సాకే సాంబశివుడు అలియాస్. సాంబ ఇద్దరూ బాబా సఫారీ కారులో బత్తలపల్లికి వస్తూ ఉండగా నల్లబోయనపల్లి గ్రామం దాటిన తర్వాత ప్రభుత్వ హైస్కూల్ వద్దకు రాగానే విశ్వనాథనాయుడు తన అనుచరులతో రోడ్డుకు అడ్డంగా వాహనం నిలబెట్టి కారులో ఉన్న కౌశిక్‌ను కిందకు లాగి ఇష్టానుసారంగా రోడ్లు, కొడవళ్లతో దాడి చేసి కారును డ్యామేజీ చేశారన్నారు. ఈ సమయంలో ముద్దూరు సాంబ అతనని రక్షించేందుకు వెళ్లగా అతనిపైనా దాడి చేశారన్నారు. గ్రామస్తులు జోక్యం చేసుకుని దెబ్బలు తగిలిన వారిని ఆర్డీటీ ఆసుపత్రికి 108 వాహనంలో తరలించి చికిత్సలు చేయించారన్నారు. ఈ కేసులో విశ్వనాథనాయుడుతో పాటు మరో ఐదుగురిపైన హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## చెరువులో జారిపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం చెరువులో జారిపడి సాకే రామాంజనేయులు (43) అనే బేల్దారి మృతిచెందాడు. ఆదివారం రాత్రి జరిగిన ఈఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు.. స్థానిక వైఎస్ఆర్ కాలనీలో నివాసం ఉన్న రామాంజినేయులు సాయి నగర్‌లో ఉన్న తన తల్లి ఇంటికి వెళ్లాడు. ఆదివారం రాత్రి చీకటి పడిన తరువాత బహిర్భూమికి చెరువు దగ్గరికి వెళ్ళాడు. అనుకోకుండా చెరువులో జారి పడ్డాడు. ఉదయం రామాంజినేయులు మృతదేహం చెరువులో కన్పించడంతో స్థానికులు మృతుని బంధువులకు సమాచారమిచ్చారు. మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

## తుపాకీ ఉన్న వ్యక్తిపై కేసు నమోదు

ప్రజాశక్తి - బత్తలపల్లి

మండలంలోని నల్లబోయనపల్లికి చెందిన వ్యక్తిని అనుమతి లేని పిస్టల్ కలిగి ఉన్నాడన్న కారణంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. గ్రామానికి చెందిన బెస్త కౌశిక్ ఇంటి లో అక్రమంగా ఆయుధం ( కంట్రీ మేడ్ పిస్టల్ ) కలిగి వున్నాడని రాబడిన సమాచారం మేరకు సిబ్బంది తో కలసి ఆదివారం రాత్రి 10 : 45 గంటల సమయంలో రెవెన్యూ సిబ్బంది, పెద్దమనుషుల సమక్షంలో సోదాలు నిర్వహించామన్నారు. ఎలాంటి అనుమతి లేకుండా ఆయుధం కలిగి ఉన్నాడని బెస్త కౌశిక్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

## ద్విచక్ర వాహనాన్ని ఢీ కొన్న కారు

ప్రజాశక్తి -నంబులపూలకుంట

మండల కేంద్రంలో సోమవారం కదిరి-రాయచోటి రోడ్డులో ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న సంఘటన చోటు చేసుకుంది. మండలకేంద్రంలో అధికసంఖ్యలో రోడ్డుకు అడ్డంగా ఉన్న ప్రదేశంలో వేగంగా వచ్చిన కారు అక్కడున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడు హరికి తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రుడినికదిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. మండల కేంద్రంలో అస్తవ్యస్తంగా ట్రాఫిక్ ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## ఘర్షణ-ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - బత్తలపల్లి

భూతగదాలో రెండు గ్రూపుల మధ్య జరిగిన ఘర్షణలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. బత్తలపల్లి పోలీసులు, బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ధర్మవరం రూరల్ మండలం తిమ్మనకొట్టాల గ్రామానికి చెందిన గోపాల్, ఆంజనేయులు, మంజు ఆదివారం మధ్యాహ్నం పొలం వద్ద జేసీబీతో పనులు చేయించుకుంటున్నారు. ఇంతలో తిరుపాలు, శివయ్య, ముణెయ్యలు భూమిలో తమకు హక్కు ఉందంటూ వారితో వాదనలకు దిగారు. ఈసందర్భంగా జరిగిన ఘర్షణలో కట్టెలతో దాడి చేయడంతో గోపాల్, ఆంజనేయులు, మంజు గాయపడ్డారు. జేసీబీ డ్రైవర్ మరికొందరు ఇరువర్గాల వారిని విడిపించారు. అనంతరం ఆసుపత్రులకు వెళ్లి వైద్యం చేయించుకున్నారు. బాధితులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## దొంగలకు ఖాకీల వత్తాసు ..!

ప్రజాశక్తి-నంబులపూలకుంట

స్థానిక పోలీస్ స్టేషను సిబ్బంది దొంగలకు, అవినీతి పరులకు వత్తాసు పలుకుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఫిర్యాదు దారులు తమకు న్యాయం చేయాలని అర్జీ ఇస్తే తప్పుచేసిన వారిని పోలీసులు వెనుకేసుకు వస్తున్నట్లు చెబుతున్నారు. సోమవారం ఉదయం స్టేషన్ సమీపంలో కారు ద్విచక్ర వాహనం ఢీ కొని వ్యక్తి తీవ్రగాయాలతో ఆస్పత్రి పాలయ్యాడు. అయితే ఈ ఘటనలో పోలీసులు కారు డ్రైవర్ పై ఎలాంటి చర్యలు తీసుకోకుండా కారును వదిలివేశారు. ఈఘటన మండల కేంద్రంలో చర్చకు దారి తీసింది. అంతేకాకుండా దిగువపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కుర్చీలు చోరీకి గురైన దానిపై ఫిర్యాదు ఇస్తే ఫిర్యాదు వాపసు తీసుకోవాలని సూచించారని తెలిసింది. జిల్లాస్థాయి అధికారులు విచారణ జరిపి ఇలాంటి అధికారులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఎన్పీకుంట పోలీసుస్టేషన్

## ఆధిపత్య పోరుతో బీసీ నేతపై దాడి అమానుషం

ప్రజాశక్తి - బత్తలపల్లి

అధికార పార్టీ నాయకుల మధ్య జరిగిన ఆధిపత్య పోరులో బీసీ సామాజిక వర్గానికి చెందినరాఘవపల్లి సాంబపై దాడి చేసి కులం పేరుతో దూషించడం విచారకరమని వాల్మీకి సంఘం నాయకులు అన్నారు. ఘర్షణలో గాయపడిన ముష్టూరు సాంబాను వాల్మీకి సోదరులు సోమవారం పరామర్శించి దాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. తాను బీసీని కావడం వల్లే దాడికి గురయ్యానని సాంబ వివరించడంతో వాల్మీకి సోదరులు ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ,బీజేపీ నాయకులు అధికారం కోసం బీసీలను ఉపయోగించుకుని,ఆ తర్వాత నిర్లక్ష్యం చేయడం, దాడులకు పాల్పడడం చేస్తున్నారని విమర్శించారు. ఈ సంఘటన అధికార పార్టీలో ఉన్న కుల రాజకీయాలకు అద్దం పడుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో వాల్మీకిసంఘం మండల నాయకులతో పాటు జిల్లా నాయకులు అనంతపురం నరసింహులు,బోయసాంబశివ,వాల్మీకి సంఘం రాయలసీమ ఇంచార్జ్ తాడిపత్రి బుల్లెట్ లింగమయ్య, ముదిగుబ్బ ఈశ్వరయ్య, అప్పరాచెరువు ఈశ్వరయ్య, మండల నరసింహులు, ముదగ ప్రకాష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంపై చర్యలకు డిమాండ్

ప్రజాశక్తి - పరిగి

పరిగి మండల కేంద్రంలోని షుగర్ ఫ్యాక్టరీ భూములలో అసైన్మెంట్, ప్రభుత్వ భూములు 16 ఎకరాలు ఉండేదని అయితే ఇప్పుడు మూడు ఎకరాలు మాత్రమే ప్రభుత్వ భూమి చూపిస్తున్నారని వెంటనే రీ సర్వే చేయించి ప్రభుత్వ భూమి గుర్తించి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు పరిగి గ్రామానికి చెందిన బద్రీనాథ్ మున్నా నవీన్ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహశీల్దార్ కు వినతి పత్రం ఇచ్చారు. అక్రమణలపై చర్యలు తీసుకుని ప్రభుత్వం భూములను స్వాధీనం చేసుకుని రానున్న కాలంలో ప్రజా ప్రయోజన కోసం ఈ భూములను వినియోగించాలని అధికారులను కోరారు.